

దండు మోహన్‌కు పరామర్శ
సంతాపం ప్రకటించిన బిజేయూ నాయకులు


8లో..


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 292
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
ఆగస్టు 30, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


# సమరానికి..

- రాష్ట్ర క్యాబినెట్ కీలక నిర్ణయం
- స్పెషల్ జీవోతో ముందుకు
- రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేసేందుకు గ్రీన్ సిగ్నల్
- అసెంబ్లీలో తీర్మానం చేసేందుకు రెడీ
- షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలకు ప్రభుత్వం యత్నం




## సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. షెడ్యూల్ ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు 'సై' అంది. హైకోర్టు ఆదేశించినట్లు సెప్టెంబర్ 30 లోపు పంచాయతీ ఎన్నికల పర్వాన్ని పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమై పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం ప్రత్యేక జీవో తీసుకు రావాలని భావిస్తున్న ప్రభుత్వం ఇందుకోసం పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285(ఎ)కు సవరణ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేసేందుకు రెడీ అవుతోంది. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తీర్మానం చేసేలా ప్రణాళిక రూపొందించారు. అదే విధంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామ్, క్రికెటర్ అజారుద్దీన్ పేర్లను కేబినెట్ కన్ఫామ్ చేసింది.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు2లో..



8లో..

## రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ద్వేష పూరిత పార్టీ కాంగ్రెస్
- మోదీ ఆయన తల్లిపై అవమానకర వ్యాఖ్యలు సిగ్గుచేటు
- విద్వేషం వెదజల్లడమే ఆయన నైజం
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



## భద్రకాళిని దర్శించుకున్న ఆర్టీఐ కమిషనర్లు

- మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం
- మహదాశీర్వచనం చేసిన అర్చకులు

2లో..


## అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

కుడా వీసీ, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి



# సమరానికి.. సై

- సెప్టెంబర్ లో స్థానిక సంస్థల ఎన్నికలు
- రాష్ట్ర క్యాబినెట్ కీలక నిర్ణయం
- స్పెషల్ జీవోతో ముందుకు
- రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేసేందుకు గ్రీన్ సిగ్నల్
- అసెంబ్లీలో తీర్మానం చేసేందుకు రెడీ
- షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలకు ప్రభుత్వం యత్నం




**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** స్థానిక ఎన్నికలకు తెలంగాణ క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక సమరానికి పోతామంటూ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమై పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. 42శాతం రిజర్వేషన్ తోపాటు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల ఎంపికపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బీసీ రిజర్వేషన్లకు అడ్డంకిగా ఉన్న సీలింగ్ క్యాప్ ఎత్తివేతకు కేబినెట్ ఆమోదం తెలిపింది. స్పెషల్ జీవో తెచ్చి ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసేందుకు సిద్ధం కావాలంటూ పిలుపునిచ్చారు. ఈ బిల్లును త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి.

### ఫిబ్రవరి 2024 లోనే ముగిసిన పదవీకాలం..

రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం 2024 ఫిబ్రవరి 1వ తేదీన ముగిసింది. అప్పటినుంచి గ్రామాల పాలనను ప్రత్యేక అధికారులు చేపట్టారు. ఒక్కో ప్రత్యేక అధికారికి మూడు, నాలుగు గ్రామ పంచాయతీలను కేటాయించడంతో అభివృద్ధి కుంటుపడింది. సర్పంచులు లేకపోవడంతో పాలన పడకేసిందన్న ఆరోపణలున్నాయి. అప్పుడూ.. ఇప్పుడూ అంటూ ఎన్నికలను దాటవేస్తూ వచ్చారు. దీంతో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించడం లేదంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. ఆరు నెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల కేసు విచారణకు వచ్చింది. ఎన్ని రోజుల్లో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందో చెప్పాలంటూ హైకోర్టు పిటీషనర్లను ప్రశ్నించింది. ఫిబ్రవరి 2025 లోనే ఎన్నికలు నిర్వహిస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చి ఎందుకు ఎందుకు నిర్వహించలేదంటూ న్యాయస్థానం నిలదీసింది. అయితే రాష్ట్రంలో కుల గణన సర్వే పూర్తి కానందున మరో 30 రోజుల సమయం కావాలంటూ ప్రభుత్వం కోర్టును కోరింది. ఎన్నికల సంఘం 60 రోజుల గడువు కోరింది. ఈ మేరకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం అభ్యర్థనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం మూడు నెలలు గడువిస్తూ సెప్టెంబర్ 30 లోపు పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయాలంటూ ఆదేశించింది.

### ప్రత్యేక జీవోతో ముందుకు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా ప్రభుత్వం రెండు బిల్లులను అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్ కు పంపించగా అవి ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం 50 శాతం సీలింగ్ విధిస్తూ తీసుకువచ్చిన పంచాయతీరాజ్ చట్టానికి సవరణల కోసం ప్రభుత్వం ఆర్డినెన్స్ ను గవర్నర్ కు పంపించింది. ఇది కూడా గవర్నర్ నుంచి రాష్ట్రపతికి చేరినా పెండింగ్ లోనే ఉంది. అయితే స్థానిక ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు మించకుండా కేసీఆర్ తెచ్చిన ఆర్డినెన్స్ లో మార్పులు చేసేందుకు ప్రత్యేక జీవో తేవాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఈ మేరకు అసెంబ్లీలో చట్టసవరణ బిల్లు ద్వారా 50 శాతం సీలింగ్ ను సడలించి షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది.



# భద్రకాళిని దర్శించుకున్న ఆర్టీఐ కమిషనర్లు

- మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం
- మహదాశీర్వచనం చేసిన అర్చకులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరంలో పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బి.అయోధ్య రెడ్డి శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వీరికి ఆలయ అధికారులు, అర్చకులు మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు జేశారు. పూజానంతరం ఆలయ స్నపన మండపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ సిబ్బంది, దేవాలయ పర్యవేక్షకులు కాంతికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

**కుడా వీసీ, జీడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి**

**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** ఖిలా వరంగల్ ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుటలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కుడా వైస్ చైర్ పర్సన్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ కుడా అధికారులతో కలిసి ఖిలా వరంగల్ లోని తూర్పు, పడమర, పశ్చిమ, ఉత్తర కోటలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గుండు చెరువు సుందరీకరణ పనులను కమిషనర్ పరిశీలించారు. గుండు చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయడంలో భాగంగా చేపడుతున్న అడ్వెంచర్స్ స్పోర్ట్స్, వాకింగ్ ట్రాక్, ఫుడ్ కోర్ట్ పనులను పరిశీలించారు. కోట చుట్టూ మోట్ జీవ పునరుద్ధరణ (బయో డైవర్సిటీ) పనులను త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుడా పీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీం రావు, డీఈ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ జాగిలానికి పదవీ విరమణ


☐ పాల్గొన్న కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో గత 12 సంవత్సరాలుగా సేవలందించిన పోలీస్ జాగిలం బ్రోనోకు పోలీస్ అధికారులు శనివారం పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సుధీర్ఘ కాలంగా సేవలందించిన బ్రోనోను ఘనంగా సత్కరించారు. ట్రాకర్ జాగిలంగా గుర్తించబడిన బ్రోనో పోలీస్ శాఖలో చేరిన నాటి నుంచి 15 కేసుల్లో నిందితులను గుర్తించడంతో పాటు జాతీయ పోలీస్ డ్యూటీ మీట్లలో పలు పతకాలను సాధించిందని కొనియాడారు. దీని శిక్షకుడిగా హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ వ్యవహరించారు.

### ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి..

పదవీవిరమణ చేసిన పోలీస్ అధికారులు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సుధీర్ఘ కాలం పని చేసి పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారులను సీపీ శనివారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. పదవీ విరమణ పొందిన వారిలో ఎస్ఐలు యాకుబ్ మొహినూద్దీన్, మహమ్మద్ అలీ, రాధే శ్యామ్ శర్మ, యాదగిరి, నందమ చారి, ఏఎస్ఐలు జీలాని, సురేందర్, హెడ్ కానిస్టేబుళ్లు ముత్తయ్య, యాకుబ్ పాషా, శ్రీనివాస్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, శ్రీనివాస్, ఏసీపీ సురేంద్ర, ఆర్ఐలు సతీష్, స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, శ్రీధర్ చంద్రశేఖర్, ఆర్ఎస్ఐ శ్రవణ్ తో పాటు పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





# గీసుగొండలో ఏఐ మండపం

☐ ఆకట్టుకుంటున్న గణపయ్య

**వరంగల్ వాయిస్, గీసుగొండ :** వరంగల్ జిల్లా గీసుగొండ మండల కేంద్రంలోని కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో ఏఐ డిజైన్ తో ఏర్పాటు చేసిన 3డి కాన్వాస్ ప్రింటింగ్ గణపయ్య అందరినీ ఆకర్షిస్తోంది. గత 20 సంవత్సరాలుగా కాటమయ్య యూత్ సభ్యులు పర్యావరణ పరిరక్షణకు మట్టి గణనాథులను మాత్రమే ప్రతిష్టించడంతోపాటు అన్నదాన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. యూత్ సభ్యులు వీరగోని హరీష్, వీరగోని రవితేజ, వీరగోని మురళి, కత్తి కన్నయ్య, కోల అభినవ్, కోల అరుణ్, కోల సాయి తరుణ్, కోల రాజ్ కుమార్, కత్తి హరీష్, కత్తి అఖిల్, అందే సాయి రామ్, పొగాకు త్రినేష్, బండారి వివేక్, వీరగోని సిద్దు, కర్ణకంటి విక్రమ్, ముల్క వాసు, వీరాటి తరుణ్, పులిసేరు రేవంత్, రాహుల్ తదితరులు అందుబాటులో ఉంటూ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

# మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

◆ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళలు ఆర్థికంగా బలోపేతమైనప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. భీమారంలోని ఎంటీఆర్ గార్డెన్స్‌లో గీతాంజలి మహిళా డిగ్రీ కళాశాల నిర్వహించిన 'మహిళా సాధికారత' కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థినులు తమ లక్ష్యాలను చేరుకోవాలంటే దృఢ సంకల్పం, అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ఆడపిల్లలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. మహిళలు ఎవరిపైనా ఆధారపడకుండా ఉండాలంటే స్వయం







సమృద్ధి సాధించాలని, ఇందుకోసం విద్య, నైపుణ్య శిక్షణ, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధిస్తేనే సామాజికంగా, ఆర్థికంగా ఎదగగలరని, సమాజంలో గౌరవప్రదంగా జీవించవచ్చని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతోందని, అవి ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయని అన్నారు. మహిళలందరూ ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విధర్భను మించిన ఆత్మహత్యల రాష్ట్రంగా తెలంగాణ

◆ డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఆత్మహత్యల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి, తెలంగాణ 'విధర్భ'ను మించిపోయిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు విడుదల కాకపోవడంతో అప్పుల బాధలు తట్టుకోలేక ఇప్పటివరకు ఎనిమిది మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు నేరుగా అంది గ్రామాలను అభివృద్ధి చేశారని, ఇప్పుడు గ్రామాలు పారిశుధ్య లోపంతో రోగాల బారిన పడుతున్నాయని అన్నారు. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు 713 మంది, నేత కార్మికులు 45 మంది, ఆటో డ్రైవర్లు 155 మంది, గురుకుల విద్యార్థులు 107 మంది ఆత్మహత్య చేసుకున్నారని శ్రీకాంత్ గౌడ్ ఆరోపించారు. ఆటో కార్మికులకు ప్రకటించిన రూ. 12,000 జీవన భృతిని ఇవ్వకపోవడం వల్లే ఈ ఆత్మహత్యలు జరిగాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కనీస మందులు, రేబిస్ టీకాలు కూడా అందుబాటులో లేవని ఆయన అన్నారు. ప్రసూతి వార్డుల్లో సౌకర్యాల లేమితో 69 మంది తల్లులు, శిశువులు మరణించారని ఆరోపించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, మెదక్ ప్రాంతాల్లో అకాల వర్షాలు, క్లౌడ్ బ్రస్ట్‌తో రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, విపత్తు నిర్వహణ నిధులు ఎందుకు విడుదల చేయలేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం తమ తప్పులను వెంటనే సరిదిద్దుకోవాలని, ప్రజలకు మేలు చేయకపోతే తెలంగాణ జాగృతి ప్రజా మద్దతుతో ఆందోళన చేపడుతుందని శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు.

# ప్రజాస్వామ్యం, హక్కులపై మోడీ సర్కార్ దాడి

■ ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు
■ ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** భారత మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం స్థానిక మియాపూర్‌లోని తాండ్ర రామచంద్రయ్య భవన్‌లో జరిగింది. కామ్రేడ్ ఎం. రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇటీవల మరణించిన సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, ఎంసీపీఐ(యు) నాయకులు మొద్దు సదానందం, ఆకారపు మల్లయ్యలకు నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తోందని, ప్రజల సమస్యలను విస్మరిస్తోందని ఆరోపించారు. తమకు అనుకూలంగా లేని ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగిస్తూ, తమ నియంతృత్వాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా బీహార్‌లో 65 లక్షల ఓట్లను తొలగించడాన్ని ఆయన ప్రస్తావించారు. రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయలేదని గాదగోని రవి ఆరోపించారు. విదేశీ పత్తి దిగుమతులపై సుంకాన్ని ఎత్తివేయడం వల్ల పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు మూడు రెట్లు పెరిగినా, శ్రామికుల వేతనాలు మాత్రం పెరగలేదని, పెట్టుబడిదారుల ఆస్తులు మాత్రం అనేక రెట్లు పెరిగాయని అన్నారు. మోడీ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తామని చెప్పి కార్పొరేట్ శక్తుల కోసం పనిచేస్తోందని విమర్శించారు. నియంతృత్వ మతోన్మాద




మోడీ పాలనకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఆశలు కల్పించి, కొన్ని హామీలను మాత్రమే అరకొరగా అమలు చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కాలం గడుపుతోందని, ప్రజలు నిరాశలో ఉన్నారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని, అధిక వర్షాలతో నష్టపోయిన ప్రజలను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు వల్లపు ఉపేందర్ రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, వరికుప్పల వెంకన్న, వనం సుధాకర్, వి. తుకారాం నాయక్, ఎన్. రెడ్డి హంసారెడ్డి, పెద్దారపు రమేష్, మంద రవి, తుడుం అనిల్ కుమార్, నాగెల్లి కొమురయ్య, కంచ వెంకన్న, కర్ర రాజిరెడ్డి, వంగల రాధసుధ, తాండ్ర కళావతి, కుసుంభ బాబూరావు, అంగడి పుష్ప, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, పల్లె మురళి, పి. భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని సన్నిధిలో అన్నదానం



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలోని పదో వార్డు మమత నగర్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గణేష్ విగ్రహ దాత తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, కవిత గార్ల సహకారంతో మమత నగర్ కాలనీ వాసులైన ముప్పిడి రంజిత్, మమత దంపతులు, దార్న రవీందర్, సత్యవతి దంపతులు ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన కాలనీ వాసులు, భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, 'గణేష్ మహారాజ్ కి జై' అంటూ స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు. మమత నగర్ గణనాథుడు నవరాత్రి ఉత్సవాలకు పేరుగాంచాడని, ఈ తొమ్మిది రోజులు కాలనీ వాసులంతా పండగ వాతావరణంలో వేడుకలు జరుపుకుంటున్నారని నిర్వాహకులు తెలిపారు. శనివారం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులకు, కాలనీ వాసులకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# జైపాల్ రెడ్డిని పరామర్శించిన బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత సహాయకులు వెల్దండి జైపాల్ రెడ్డి తండ్రి వెల్దండి రామచంద్రారెడ్డి ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తిర్మలాపూర్‌లోని వారి నివాసానికి వెళ్లి జైపాల్ రెడ్డిని పరామర్శించారు. అక్కడ రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించి, కుటుంబ సభ్యులకు బొద్దిరెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శలో బొద్దిరెడ్డి వెంట మైనారిటీ నాయకులు మాజిద్, కళ్యాణ్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

# పులి దాడిలో చనిపోయిన లేగదూడకు పరిహారం



**వరంగల్ వాయిస్, మల్హర్:** భూపాలపల్లి జిల్లా, మల్హర్ మండలం, ఎడ్లపల్లి గ్రామానికి చెందిన గుర్రం రాజయ్యకు చెందిన లేగదూడ పులి దాడిలో చనిపోగా, అటవీశాఖ అధికారులు మంజూరు చేసిన రూ.30,000 పరిహారాన్ని అందజేశారు. ఈ ఏడాది జూన్ 20న బొగ్గుల వాగు సమీపంలో పులి దాడిలో లేగదూడ చనిపోయినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కొయ్యూరు అటవీ అధికారులు భూపాలపల్లి ఎఫ్‌డీఓ అప్పలకొండకు పంపించారు. ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం ఎఫ్‌డీఓ చనిపోయిన లేగదూడ యజమానికి పరిహారం మంజూరు చేశారు. శనివారం కొయ్యూరు రేంజ్ అధికారి జి.రాజేశ్వరరావు, సెక్షన్ అధికారి ఎంఏ ఇంతియాజ్, బీట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు.. యజమాని గుర్రం రాజయ్యకు రూ.30,000 చెక్కును అందజేశారు.

# అసైన్డ్ భూములపై అసెంబ్లీలో బిల్లు పెట్టాలి

◆ ఏబీఎస్ అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్



**వరంగల్ వాయిస్, ములుగు :** అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పించాలన్న హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. వరంగల్‌లోని రైతు గర్జన సభలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసైన్డ్ భూములపై ఉన్న ఆంక్షలు ఎత్తివేసి, పూర్తి హక్కులు ఇస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా, ఈ హామీని అమలు చేయడంలో ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని మహేందర్ విమర్శించారు. అసైన్డ్ భూములకు శాశ్వత హక్కుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) 2019 నుంచి ఈ విషయంలో పోరాటం చేస్తుందని, గతంలో తాము ఈ అంశాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని ఆయన చెప్పారు. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాలు ఈ సమస్యను లేవనెత్తాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ విషయంలో చొరవ తీసుకుని, ముఖ్యమంత్రి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి అసైన్డ్ రైతులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కలకోటి మహేందర్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతి గౌడ్, కుర్ర రవి యాదవ్, బీఎస్పీ నాయకులు కాడపాక రాజశేఖర్ వర్మ, మోతె రమేష్, ల్యాదేళ్ల అశోక్, కుర్రి దినాకర్, రాజకుమార్, కొమురయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్‌లో ఎన్ హెచ్‌ఎం ఉద్యోగుల సమావేశం

### విజయవంతం చేయాలని రాజేష్ ఖన్నా పిలుపు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్‌ఎం) ఉద్యోగుల సమావేశం ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆసిఫాబాద్ మోడల్ స్కూల్‌లో నిర్వహించబడుతుందని జిల్లా అధ్యక్షుడు భోగే ఉపేందర్, ప్రధాన కార్యదర్శి బి. మధుకర్ తెలిపారు. ఈ సమావేశానికి ఎన్.హెచ్.ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ తప్పక పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. సురేష్ నాయక్, మరియు రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ దేవనబోయిన బాపు యాదవ్ హాజరవుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఈ సమావేశానికి ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కాశిబుగ్గలో రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాశిబుగ్గ 19వ డివిజన్‌లోని 'ఓ' సిటీ రోడ్‌లో ఉన్న బీరన్న దేవాలయంలో బీరప్ప యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. నాలుగో రోజు జరిగిన ఈ కార్యక్రమాన్ని 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 100 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఎంజీఎం బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీరప్ప యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచ శ్రవణ్, ప్రధాన కార్యదర్శి అల్లే రాకేష్, కోశాధికారి గౌడ వినీత్, కోరే రాజ్ కుమార్, మహేష్, పవన్, శ్రీరామ్, వరుణ్, అజయ్, రిషి, సురేందర్, గంగాధర్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమంగా గుట్కా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



**వరంగల్ వాయిస్, క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్స్ పోలీసులు పరకాల పట్టణంలో అక్రమంగా గుట్కా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. శనివారం విశ్వసనీయ సమాచారం మేరకు పరకాలలోని రెపకా అశోక్ (42) ఇంటిపై టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఏ. మధుసూదన్ నేతృత్వంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నిందితుడి నుంచి రూ.2,01,600 విలువ గల గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం, నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి విచారణ కోసం పరకాల పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఎస్సై వీరస్వామి, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, పరకాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రోషన్ గైక్వాడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్‌కు చెందిన రోషన్ గైక్వాడ్ వరంగల్ అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. నేషనల్ హెడ్ ఐవైసీ సోషల్ మీడియా మంజు జైన్ ఈ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. గతంలో రోషన్ గైక్వాడ్ యూత్ కాంగ్రెస్ పశ్చిమ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా, సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు. తనకు ఈ పదవిని ఇచ్చినందుకు నేషనల్ హెడ్ మంజు జైన్‌కు, సహకరించిన వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డికి, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావుకు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావుకు, టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి ముస్తాక్ నెహాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## 31న డయల్ యువర్ డీఎం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించే ఉద్దేశంతో 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. ఈ నెల 31 ఆదివారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా, హనుమకొండ డిపో పరిధిలోని జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలా వరంగల్, హసన్ పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట మండలాల ప్రజలు 8977781103 నంబర్‌కు ఫోన్ చేసి, తమ విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలని డిపో మేనేజర్ కోరారు. ప్రజల సహకారంతో డిపోను మరింత అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, గణపురం :** బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తి సత్యపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గణపురం మండలం చెల్పూర్ గ్రామంలోని సాంబమూర్తి ఆలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఊర నవీన్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దుగ్గిశెట్టి పున్నమి చందర్, బూత్ అధ్యక్షులు కాశెట్టి సాయికుమార్, కంకణాల వంశీ, కూకట్ల నరేందర్, వేముల రమేష్, ఇసంపల్లి భారతమ్మ, మండల రాజు తదితరులు పాల్గొన్నారు.

### శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నేతలు..

**వరంగల్ వాయిస్, శాయంపేట:** భూపాలపల్లి నియోజకవర్గం ఇంచార్జి, బీజేపీ నాయకురాలు చందుపట్ల కీర్తి రెడ్డికి శాయంపేట మండల బీజేపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండలోని ఆమె నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి, మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కీర్తి రెడ్డి, పార్టీ కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. శాయంపేట బీజేపీ మండల శాఖ తరపున ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసినట్లు వారు తెలిపారు.



## విద్యార్థులు విద్యలో రాణించాలి




**వరంగల్ వాయిస్, జనగామ :** మండలంలోని ఓబుల్ కేశ్వాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇంఛార్జి జిల్లా విద్యా శాఖాధికారి పింకేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులను, ఉపాధ్యాయుల హాజరును, విద్యార్థుల నమోదును పరిశీలించారు. పాఠశాల ఆవరణ, వంటగది పరిశుభ్రతను పరిశీలించి, వృథా సామాగ్రిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు తాగునీటి సదుపాయాలు, ఇతర ఇబ్బందులపై ఆరా తీశారు. ల్యాబ్ మెటీరియల్, స్పోర్ట్స్ రూమ్, లైబ్రరీ పుస్తకాల షెల్ఫ్‌లను కూడా పరిశీలించారు. ఆర్వో ప్లాంట్ సరిగా పనిచేస్తుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులకు అందజేస్తున్న యూనిఫారాలు, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట విద్యాశాఖ అధికారులు, ఎంపీడీఓ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



**వరంగల్ వాయిస్, సుబేదారి:** పర్వతగిరి మండలం, కొంకపాక గ్రామానికి చెందిన మాదాసి అజయ్ భార్య సుమతి జీవనోపాధి కోసం హనుమకొండలోని టీచర్స్ కాలనీ, అమృత్ అపార్ట్‌మెంట్స్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. వీరికి విహాన్ అనే మూడేళ్ల బాలుడు ఉన్నాడు. శనివారం ఉదయం 8 గంటల సమయంలో ఆ బాలుడు అనుకోకుండా తప్పిపోయి ఎక్సైజ్ కాలనీలో తిరుగుతూ కనిపించాడు. దీన్ని గమనించిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్ కుమారస్వామి ఆ బాలుడిని సురక్షితంగా సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం, పోలీసులు బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించి, వారి సమక్షంలో చిన్నారిని అప్పగించారు. ఈ సందర్భంగా బాలుడిని సురక్షితంగా గుర్తించి తల్లిదండ్రులకు చేర్చిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ కుమారస్వామి, హెడ్ కానిస్టేబుల్ సునీతను సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం.రంజిత్ కుమార్ అభినందించారు.

# 7న 'చలో హైదరాబాద్' రాష్ట్ర స్థాయి సదస్సు

## ■ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై సెప్టెంబర్ 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ తొర్రూర్ పట్టణ కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్ రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి శివారపు శ్రీధర్ మాట్లాడుతూ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు అన్ని రంగాల కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో




ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు హెచ్. లింగ్యా, ఔట్‌సోర్సింగ్ వర్కర్ రమేష్, ఇరుగు నాగన్న, సుర యాకయ్య, రాము పాల్గొన్నారు.

# దాసు రఘురాంకు బీసీ నేతల నివాళి



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ తండ్రి, రిటైర్డ్ ఎస్సై దాసు రఘురామ్ ఇటీవల మరణించగా, పలువురు నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. శనివారం బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కీ.శే. రఘురామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమారస్వామి, బీసీ రాజ్యాధికార సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, మారేపెల్లి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## దాసు సురేష్‌ను పరామర్శించిన వరికెల..



బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ తండ్రి రఘురాం మృతి పట్ల తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు సంతాపం తెలిపారు. శనివారం ఎర్రగట్టు గుట్టలోని దాసు సురేష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ రావు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, పరకాల:** బీహార్ ఎన్నికల సభలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోడీ తల్లిని దూషించడంపై పరకాల పట్టణ బీజేపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు నిరంజన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రధాని మోడీకి పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. బీహార్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే రాహుల్ గాంధీ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఒక పేద తల్లి కుమారుడు 11 సంవత్సరాలుగా ప్రధాని పదవిలో ఉండడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, పరకాల రూరల్ అధ్యక్షుడు కాసగాని రాజ్ కుమార్, నాయకులు కుక్కల విజయ్ కుమార్, మారేడుగొండ భాస్కరాచారి, పల్లెబోయిన రామన్న, పావుశెట్టి శ్రీనివాస్, నాగెల్లి రంజిత్, దార్న సునీల్, ఆకుల రాంబాబు, గోనెల నరసింహ, నాగరాజు, కక్కు రాజు, సారంగ నరేష్, సాదా మధుకర్, గాజుల రంజిత్, దామ సతీష్, జనగాని రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గీతాంజలి స్కూల్లో మహా అన్నదానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** నగరంలోని వివేకానంద కాలనీలో ఉన్న గీతాంజలి స్కూల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పిట్టల సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు భక్తి కూడా ముఖ్యమని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ పిట్టల సప్న, ఉపాధ్యాయులు శ్రీలత, ఎం. రాధిక, ఆర్.సుమలతతో పాటు పాఠశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై సమీక్ష



**వరంగల్ వాయిస్, దామెర:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై దామెర మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ గుమ్మడి కల్పన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఓటర్ల జాబితాలో ఒక గ్రామానికి చెందిన పేర్లు మరొక గ్రామంలో చేర్చినట్లు సమావేశంలో నాయకులు తెలిపారు. దీనిపై చర్చించిన అనంతరం, ఈ మార్పులను సరిదిద్దడానికి అంగీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రంగాచారి, వివిధ పార్టీల నాయకులు పోలేపాక శ్రీనివాస్, దురిశెట్టి భిక్షపతి, గండు రామకృష్ణ, జాకీర్ ఆలీ, సదిరం పోశయ్య, రాజ్ కుమార్, బొల్లు రాజు, పావడాల మధుకర్, భిక్షపతి, దాడి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణపతి నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



**వరంగల్ వాయిస్, దామెర :** గణపతి నిమజ్జన ఉత్సవాల సందర్భంగా దామెర మండలంలోని నిమజ్జన ప్రదేశాలను అధికారులు శనివారం పరిశీలించారు. దామెరలోని గిద్దె చెరువు, ఊరుగొండలోని ఊరుగొండ చెరువులను సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గుమ్మడి కల్పన, ఎంపీఓ రంగాచారి, ఎస్సై కొంక అశోక్, పంచాయతీ కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు. నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

# మా భూమిని కాపాడండి



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలోని దామర చెరువు సమీపంలో ఉన్న తమ భూమిని ఆక్రమణకు గురికాకుండా చూడాలని నేరెళ్ల రమేష్, ఆయన కుటుంబ సభ్యులు అధికారులను కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడిన వారు తమ సమస్యను వివరించారు. మాదారం శివారులోని సర్వే నంబర్ 609లో ఉన్న ఎకరం 19 గుంటల భూమి తమ తండ్రి నేరెళ్ల నర్సయ్య పేరు మీద పట్టా ఉందని వారు తెలిపారు. 1963 నుంచి ఇప్పటివరకు ఆ భూమి తమ ఆధీనంలోనే ఉందని, అయితే కొంతమంది వీఆర్‌ఏ, వీఆర్‌ఓలు ఆ భూమిని తమదిగా ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ భూమిని ఎవరూ కొనడం లేదా అమ్మడం చేయవద్దని వారు ప్రజలను కోరారు. తమ వద్ద భూమికి సంబంధించిన అన్ని ఆధారాలు ఉన్నాయని, రెవెన్యూ, పోలీస్ అధికారులు తమకు సహకరించి, తమ భూమి తమకు దక్కేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల రమేష్, నేరెళ్ల నర్సయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, గణపురం:** వినాయక చతుర్థి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం గణపురం మండలంలోని కార్పెంటర్ కాలనీలో యువసేన ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కోటగుళ్లు పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్ గణపతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఎల్. భాస్కర్, భూపాలపల్లి జిల్లా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు మోతే కరుణాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీ నరసింహారావు, బైరగాని కుమారస్వామి గౌడ్ తదితరులు ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ సభ్యులు నాగపురి శ్రీనివాస్ గౌడ్, రౌతు కిషోర్, తోట నవీన్ కుమార్, కొయ్యల గౌతమ్ గౌడ్, బాలాజీ నవీన్, నాగరాజు, గొర్రె ఎల్లన్న, పెద్ది ప్రశాంత్, కాంబత్తుల ప్రభాకర్ మరియు యువసేన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సీపీఎస్ అంతం పీఆర్టీయూ పంతం



**వరంగల్ వాయిస్, నడికూడ:** సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఛలో హైదరాబాద్' మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీఆర్టీయూ నడికూడ మండల శాఖ అధ్యక్షుడు అచ్చ సుదర్శన్ ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2004 నుంచి అమలవుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (CPS) రద్దు కోసం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు పోరాడుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తన మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లగం దామోదర్ రెడ్డి పిలుపు మేరకు 'సీపీఎస్ అంతం, పీఆర్టీయూ పంతం' నినాదంతో ఈ మహా ధర్నాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని సీపీఎస్ ఉపాధ్యాయులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి పోరాటంలో పాల్గొనాలని కోరారు. ధర్నాకు వచ్చే ఉపాధ్యాయులు నలుపు రంగు దుస్తులు ధరించి రావాలని అచ్చ సుదర్శన్ సూచించారు.

# సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పెన్షన్ విద్రోహ దినంగా సెప్టెంబర్ 1న భారీ నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు, జిల్లా జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విద్యాశాఖ ఫోరం అధ్యక్షులు భరత్ కుమార్, రాష్ట్ర ఫోరం కార్యదర్శి ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆకుల రాజేందర్ మాట్లాడుతూ అంబేద్కర్ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ఉద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, ఓల్డ్ పెన్షన్ విధానాన్ని వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, జేఏసీ నేతలు సంపత్ రావు, టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, శ్యామ్ సుందర్, కేంద్ర సంఘ నాయకులు రాము నాయక్, విద్యాశాఖ ఫోరం కార్యదర్శి రాజేశ్వర్, ప్రసాద్, సుధాకర్, గౌస్, శ్రీనివాస్, అలీం, శైలజ, టీఎన్జీవోస్ నేతలు రాజేష్ ఖన్నా, భారత్, రాజీవ్, ప్రణయ్, పృథ్వీ, నిఖిల్, మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ర్యాంకింగ్‌పై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 'స్వచ్ఛ ఏవ హరిత విద్యాలయ' ర్యాంకింగ్‌పై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను శుభ్రంగా, పచ్చగా, విద్యార్థులకు అనుకూలమైన వాతావరణంగా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ వంటి అంశాలపై దృష్టి సారించాలని చెప్పారు. అలాగే, పిల్లలను పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు రాయబారులుగా తయారుచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ కుసునపు కిరణ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు మహేందర్, తిరుపతయ్య, శ్రీనివాస్, శ్రీలత, రవీందర్, ఎంఆర్‌సీ సిబ్బంది హరీష్, నరేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో 'ఈసీసీ డే' వేడుకలు




**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండలంలోని అంగన్‌వాడీ నంబర్–1 సెంటర్‌లో టీచర్ చింతల సంధ్యారాణి ఆధ్వర్యంలో, క్రోసూరుపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ సుజాత అధ్యక్షతన శనివారం 'ఈసీసీ డే' వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ, కేంద్రం నుంచి అందుతున్న సేవల గురించి తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు, కమిటీ సభ్యులకు వివరించారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని వారు కోరారు. ఇక్కడ పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడేలా ఆటలు, పాటలతో విద్యను అందిస్తారని, సిలబస్ ప్రకారం బోధన జరుగుతుందని సంధ్యారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా లావణ్య, తల్లులు దాసారపు శిరీష, శీలపాక వనిత, రమ్య, సౌజన్య, శ్రీలత, పూజ, నమిత, స్వాతి పాల్గొన్నారు.

# రాజమౌళి దాతృత్వం అభినందనీయం


◆ కేయూ వీసీ కే. ప్రతాప్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ యూనివర్సిటీ (కేయూ) ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌లోని యూరో మెడికేర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జే. రాజమౌళి దాతృత్వాన్ని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అభినందించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జే. కృష్ణవేణి, డీన్ ఆచార్య గాదె సమ్మయ్య అభ్యర్థన మేరకు రాజమౌళి రూ. 2.56 లక్షల విలువైన ఔషధాలను యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రానికి అందజేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చి, స్వయంకృషితో ఎదిగి సమాజానికి సాయం చేయాలనే రాజమౌళి స్వభావం అభినందనీయమని కొనియాడారు. ఆయన ప్రేరణతో మరికొంతమంది ముందుకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ ఈ మందులను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసి, అవసరమైన వారికి అందజేయాలని ఆరోగ్య కేంద్రం ఇంఛార్జి ఆచార్య ఎన్. ప్రసాద్‌ను సూచించారు. డీన్ ఆచార్య గాదె సమ్మయ్య మాట్లాడుతూ కరీంనగర్‌లోని ఓ మారుమూల గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన రాజమౌళి పేపర్ బాయ్‌గా, వంట మనిషిగా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి, ఉన్నత విద్యను అభ్యసించారని తెలిపారు. కేయూ ఫార్మసీ కళాశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసి, ఈరోజు సొంతంగా ఫార్మా పరిశ్రమను స్థాపించి పదిమందికి ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు. 1986లో స్థాపించిన యూరో మెడికేర్ ఇంటర్నేషనల్ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి కంపెనీగా ఎదిగిందని అన్నారు. భారత డ్రగ్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దశాబ్దకాలం పనిచేసి జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సాధించిన రాజమౌళి ఈ తరం విద్యార్థులకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాత పనులకే కొత్త ప్రారంభోత్సవాలు

**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఊరుగొండ గ్రామంలో జరిగిన గ్రామ కమిటీ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ జాకిర్ అలీ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు కునాటి సునీల్ రెడ్డి అధ్యక్షతన, మండల పార్టీ అధ్యక్షుడు గండు రాము ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ప్రభుత్వం మారి 20 నెలలు గడిచినా, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మంజూరు చేసిన పనులనే ఇప్పటికీ కొనసాగిస్తున్నారని జాకిర్ అలీ ఆరోపించారు. కొత్తగా నిధులు తీసుకొచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తి అయిన పల్లె దవాఖానను ఇప్పుడు ప్రారంభిస్తున్నారని, గత ఈజీఎస్ బడ్జెట్‌లో మిగిలిపోయిన రూ. 25 లక్షల నిధులతో సీసీ రోడ్లను పూర్తి చేశారని అన్నారు. ధర్మారెడ్డి మంజూరు చేసి శంకుస్థాపన చేసిన రూ. 20 లక్షల గ్రామ పంచాయతీ పనులకు మళ్లీ శంకుస్థాపన చేశారని, సింగరాజుపల్లి రోడ్డుకు కూడా రెండోసారి శంకుస్థాపన చేశారని అన్నారు. ల్యాదేళ్ల నుంచి ఎల్లంపల్లి రోడ్డు కూడా గతంలో మంజూరైనదేనని, అప్పటి మంజూరైన నాలుగు గ్రామ పంచాయతీలు ఇప్పటికీ శంకుస్థాపనకు నోచుకోలేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శంకర్, సత్యనారాయణ రెడ్డి, సునీల్, కమలాకర్, రాజు, విద్యాసాగర్, సాంబయ్య, కృష్ణమూర్తి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# మోడీ తల్లిని అవమానించడం సరికాదు



**వరంగల్ వాయిస్, దామెర:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లిపై రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దామెర మండలం ఊరుకొండ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్ నేతృత్వంలో నేషనల్ హైవేపై ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలు రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్ మాట్లాడుతూ, మోదీ తల్లిని అవమానించడం ద్వారా రాహుల్ గాంధీ తన సంస్కారాన్ని దిగజార్చుకున్నారని విమర్శించారు. ప్రజలు గౌరవించే మాతృమూర్తిపై వ్యాఖ్యలు చేయడం రాజకీయ దౌర్భాగ్యమని అన్నారు. మోదీపై ఎన్ని అవమానాలు చేసినా ఆయన మరింతగా ఎదుగుతారని, ప్రజల గుండెల్లో మరింత స్థానం సంపాదిస్తారని పేర్కొన్నారు. 'పంచభూతాలకు మలినం అంటదు, మోదీని అవమానిస్తే ఆయన అంతకంతకు ఎదుగుతారు, ప్రజల హృదయాలను మరింత గెలుచుకుంటారు' అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు గండు ముఖేష్ గౌడ్, సుర చందర్, జిల్లా పరిషత్ సభ్యులు పావుడాల మధుకర్, జిల్లా నాయకులు గంకిడి బుచ్చిరెడ్డి, శక్తి కేంద్ర ఇన్చార్జులు గోగుల సమ్మిరెడ్డి, గండు పరశురాం, ఎక్కలదేవి రమేష్, బూత్ అధ్యక్షులు నూకల రవీందర్, చేల్పూరి రాజు, నాయకులు గండు రాజు, గండు సాంబయ్య, గడ్డం కార్తీక్, సాంబారి విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# మా ఓట్లు నాగయ్య పల్లిలోనే ఉండాలి

● జాయింట్ కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** తమ గ్రామానికి చెందిన ఓట్లను వరంగల్ జిల్లాలోని మరో గ్రామంలో కలపడంపై ఆత్మకూరు మండలం, నాగయ్యపల్లి గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని ఓట్లను నాగయ్యపల్లిలోనే ఉండేలా చూడాలని కోరుతూ బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం హనుమకొండ జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకట్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నాగయ్యపల్లి గ్రామానికి చెందిన 81 మంది ఓటర్ల పేర్లను వరంగల్ జిల్లాలోని గీసుకొండ మండలం, బొడ్డు చింతలపల్లి గ్రామంలో కలిపారని ఆరోపించారు. దీనివల్ల ఎన్నికల సమయంలో ఓటు వేయడానికి అక్కడికి వెళ్లాల్సి వస్తుందని, ఇది ఓటర్లకు ఇష్టం లేని విధానమని అన్నారు. నాగయ్యపల్లి హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలో ఉన్నప్పటికీ, కొంతమంది ఓటర్ల పేర్లను మరో జిల్లాలో ఎలా కలుపుతారని ఆయన ప్రశ్నించారు. కొంతమంది ఇంటి నెంబర్లు సైతం చింతలపల్లి కింద ఉన్నాయని గ్రామస్తులు వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంలో చొరవ తీసుకుని, చింతలపల్లిలో కలిపిన 81 మంది ఓటర్ల పేర్లను నాగయ్యపల్లిలోనే తిరిగి చేర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మాజీ మండల అధ్యక్షుడు ఇరుసడ్ల సదానందం, గ్రామస్తులు పాల్గొన్నారు.



వరంగల్ వాయిస్ సినిమా
శనివారం 30 ఆగస్టు 2025





# మిరాయ్ పై అంచనాలు పెరిగాయి

ఈ మధ్యకాలంలో వందల కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమాలు కూడా గ్రాఫిక్స్ విషయంలో నెటిజన్లను మెప్పించలేక ట్రోలింగ్ బారిన పడుతున్నాయి. కానీ యంగ్ హీరో తేజ సజ్జ పరిమిత బడ్జెట్‌లోనూ సూపర్ హీరోగా ఎదుగుతున్నాడు. 'హనుమాన్' తర్వాత ఆయన జాగ్రత్తగా సినిమాలు ఎంచుకుని, పాన్ ఇండియా ప్రేక్షకులకు యూనివర్సల్ కంటెంట్ అందిస్తున్నాడు. తాజాగా, కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన 'మిరాయ్' ట్రైలర్ రిలీజ్ అయింది. కేవలం మూడు నిమిషాల –ట్రైలర్ మాత్రమే అయినా, సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచింది. ప్రారంభం నుండి ముగింపు వరకు ప్రతి ఫ్రేమ్ గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉంది. ఈ మధ్యకాలంలో ఇంత యునానిమస్ పాజిటివ్ రెస్పాన్స్ పొందిన –ట్రైలర్ మరొకటి రాలేదని చెప్పాలి. –ట్రైలర్‌లో హీరో తేజ సజ్జ, విలన్ కోసం వెతికే తొమ్మిది శక్తివంతమైన గ్రంథాలు, వాటిని అడ్డుకునే యోధుడి పోరాటం, ఎనర్జిటిక్ యాక్షన్ స్టంట్స్, అడ్వెంచర్ ఎలిమెంట్స్ అందించిన విధంగా సన్నివేశాలు ఉన్నాయి. యోధుడిగా కనిపించబోతున్న తేజ.. మరోసారి సూపర్ హీరోగా –ట్రైలర్‌తో సక్సెస్ అయ్యాడు. –ట్రైలర్ చివర్లో శ్రీరాముడు షాట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో సోషల్ మీడియాలో ప్రశంసలు పొందుతోంది. ఈ సినిమాలో డైనమిక్ హీరో మంచు మనోజ్, సీనియర్ హీరోయిన్ శ్రియ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మొత్తంగా, ఈ ఫాంటసీ యాక్షన్–అడ్వెంచర్ సినిమా పాన్ ఇండియా ప్రేక్షకులకు అంచనాలను పెంచుతూ, సెప్టెంబర్ 12న బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేయడానికి సిద్ధంగా ఉంది.

# చిరుతో వెంకటేశ్ ..



'మన శంకరవరప్రసాద్ గారు'గా సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఆయన –టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. హీరో వెంకటేశ్ ఇందులో ప్రత్యేక పాత్రలో సందడి చేయనున్నట్లు– అనిల్ ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమా కోసం ఆయన వచ్చే నెల మధ్య నుంచి సెట్లోకి అడుగు పెట్టనున్నట్లు– సమాచారం. హైదరాబాద్‌లో మొదలు కానున్న ఈ కొత్త షెడ్యూల్ కోసం ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. ఈ కథలో వెంకీ పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉందని.. చిరుతో పాటతో పాటు– యాక్షన్ సీక్వెన్స్‌లోనూ భాగమయ్యే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. వినోదం, యాక్షన్ అంశాల మేళవింపుతో సాగే ఈ కుటుంబ కథా చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.

# అల్లు అరవింద్ ఇంట విషాదం

**- అల్లు రామలింగయ్య సతీమణి కన్నుమూత**
**- భౌతిక కాయం సదర్శించిన నివాళి అర్పించిన ప్రముఖులు**



అల్లు అరవింద్ ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి, దివంగత అల్లు రామలింగయ్య భార్య కనకరత్నమ్మ (94) కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న ఆమె శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలిసిన వెంటనే చిరంజీవి కుటుంబం అల్లు అరవింద్ ఇంటికి చేరుకున్నారు. కనకరత్నమ్మ మరణవార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు ఆమె పార్థివదేహానికి నివాళులు అర్పించేందుకు అల్లు అరవింద్ ఇంటికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నివాసం వద్ద బందోబస్తు ఏర్పాటు–చేశారు. మా అత్తయ్య.. దివంగత అల్లు రామలింగయ్య భార్య కనకరత్నమ్మ శివైక్యం చెందడం ఎంతో బాధాకరం. మా కుటుంబాలపై ఆమె చూపిన ప్రేమ, ధైర్యం, జీవిత విలువలు ఎప్పటికీ మాకు ఆదర్శం. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని చిరంజీవి అన్నారు. వార్తతెలిసిన వెంటనే అల్లు అర్జున్ కూడా చేరుకున్నారు. అనంతరం నానమ్మ మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ క్రమంలోనే అల్లు అరవింద్ ఇంటికి చేరుకున్న మెగాస్టార్ చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ తన తల్లి మరణంతో శోకసంద్రంలో ఉన్న అల్లు అరవింద్, అలాగే తీవ్ర దుఃఖంలో ఉన్న అల్లు అర్జున్‌ను చిరంజీవి ఓదార్చారు. ఇక నానమ్మ మీద ఉన్న ప్రేమతో అల్లు అర్జున్ చిరంజీవి ఎదుట కంటతడి పెట్టుకున్నారు. పవన్ కల్యాణ్ సతీమణి కూడా హాజరయ్యారు. అయితే తన అమ్మమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న నటుడు రామ్ చరణ్ మైసూరులో తన సినిమా షూటింగ్‌ను మధ్యలో ఆపేసి హుటాహుటిన హైదరాబాద్ వచ్చారు. అనంతరం అమ్మమ్మ మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ క్రమంలోనే మేనమామ అరవింద్‌తో పాటు– అల్లు అర్జున్‌ని రామ్ చరణ్ ఓదార్చారు. నటులు వెంకటేశ్, బ్రహ్మానందం, దర్శకుడు త్రివిక్రమ్ ఆమెకు నివాళి అర్పించారు. పలువురు సినీ ప్రముఖులు వచ్చి పలకరించారు.

# దసరా కానుకగా ఓజీ



### సువ్విసువ్వి పాటకు వేలాది లైక్‌లు

హరిహర వీరమల్లు చిత్రంతో నిరాశపరిచిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఓజీ చిత్రంతో ఫ్యాన్స్‌కి మంచి కిక్ ఇవ్వబోతున్నాడు. ఈ సినిమా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న ' ఓజీ ' చిత్రం దసరా కానుకగా సెప్టెంబర్ 25న రిలీజ్ కానుంది. నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతోన్న 'అఖండ 2' చిత్రం దసరాకి వస్తుందని ముందు ప్రచారం జరిగినా, అది రేసు నుంచి తప్పుకోవడంతో 'ఓజీ'కి మరింత ప్లస్ కానుంది. సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్–టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మించారు. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రానున్న ఈ చిత్రంలో పవన్ సరసన ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తోంది. ఎప్పుడో రావాల్సిన ఈ చిత్రం పవన్ కళ్యాణ్ బిజీ షెడ్యూల్ కారణంగా కాస్త ఆలస్యమైంది. చివరికి అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని సెప్టెంబర్ 25న రిలీజ్‌కి సిద్ధమైంది. ఓవర్సీస్‌లో ఒకరోజు ముందుగానే ప్రీమియర్ షోలు పడనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ కూడా మొదలయ్యాయి. ఈ చిత్రానికి సంబంధించి స్టోరీ లైన్ ఒకటి బలంగా వినిపిస్తోంది. అదే నిజమైతే 'ఓజీ' బ్లాక్‌బస్టర్ కావడం ఖాయం అంటూ ఫ్యాన్స్ చెప్పుకొస్తున్నారు. సోషల్‌మీడియాలో వినిపిస్తోన్న సమాచారం ప్రకారం ... ముంబయి అండర్ వరల్డ్ నుండి పూర్తిగా మాయమైన 'ఓజస్ గంభీర' మళ్లీ తిరిగి రావడం, చీకటి ప్రపంచాన్ని శాసిస్తోన్న నిరంకుశ శత్రువైన ఓమి భావుని మట్టి కరిపించి తన సామ్రాజ్యాన్ని మళ్లీ ఎలా హస్తగతం చేసుకున్నాడన్నది చిత్ర కథగా తెలుస్తుంది. ఓజస్ గంభీర ప్రత్యర్థుల్ని ఎంత కిరాతకంగా హతమార్చాడు, నమ్మక ద్రోహానికి పాల్పడిన వారిని ఎలా శిక్షించాడు వంటి సీన్స్‌ని సుజీత్ చాలా అద్భుతంగా తెరకెక్కించాడట. పదేళ్లు కనిపించకుండా పోయిన ఓజస్ ఎక్కడికి వెళ్లాడు, ఏం చేశాడు అన్నది ఏ మాత్రం గెస్ చేయలేరట. కథ వినడానికి రొటీ–న్‌గానే ఉన్నా సుజీత్ టేకింగ్ సినిమాని మరో స్థాయికి తీసుకెళతాడని ముచ్చటించుకుంటున్నారు. వినాయక చవితి సందర్భంగా రిలీజ్ చేసిన 'సువ్వి సువ్వి' సాంగ్‌లో అయితే పవన్ లుక్ ఫ్యాన్స్‌కి తెగ నచ్చేసింది అని చెప్పాలి. ఈ మూవీ కోసం ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ద్వేష పూరిత పార్టీ కాంగ్రెస్
- మోదీ ఆయన తల్లిపై అవమానకర వ్యాఖ్యలు సిగ్గుచేటు
- విద్వేషం వెదజల్లడమే ఆయన నైజం
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ చౌరస్తా :** దేశం అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీని అకారణంగా దూషించడమే కాక ఆయన తల్లిపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ధ్వజమెత్తారు. శనివారం వరంగల్ చౌరస్తాలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో జిల్లా బీజేపీ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ద్వేషపూరిత పార్టీ అని, దానికి విలువలంటూ లేవన్నారు. విద్వేషాలను రెచ్చగొట్టడమే ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ నైజం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ అధికార్ యాత్ర పేరుతో బీహార్ రాష్ట్రంలో కాంగ్రెస్ నేత రాహుల్ చేపట్టిన కార్యక్రమాల్లో ఆ పార్టీ కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోడీ ఆయన తల్లిపై అభ్యంతరకర రీతిలో వ్యాఖ్యలు చేయడం, దానిని రాహుల్ గాంధీ వాటిని ఖండించక పోవడం ఆయన విష సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. విదేశీ సంస్కృతిలో పుట్టి పెరిగిన రాహుల్ కు తల్లి విలువ ఏం తెలుసు అని ప్రశ్నించారు. ఓట్ల రాజకీయాల కోసం కన్నతల్లిని రాజకీయాల్లోకి లాగి విషపు ఆనందాన్ని పొందుతున్నారని ఘాటుగా విమర్శించారు. జరిగిన దానికి బాధ్యత వహిస్తూ రాహుల్ గాంధీ వెంటనే ప్రధాని మోదీకి, ఆయన తల్లికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన నరేంద్ర మోడీని ఆయన తల్లి విలువలతో పెంచిందన్నారు. విదేశాల్లో పుట్టి పెరిగిన సోనియమ్మ రాహుల్ గాంధీకి నేర్పిన, విలువలు ఇవేనా అంటూ మండిపడ్డారు.

రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేని ఓ ఆదర్శవంతమైన తల్లిని తన స్వార్థం కోసం వాడుకోనే రాహుల్ గాంధీ దిగజారుడుతనాన్నీ దేశ ప్రజలు అసహించుకుంటున్నారని గంట రవికుమార్ వెల్లడించారు.

దేశ ప్రధాని అవుతానని కలలు గంటున్న రాహుల్ కు రానున్న రోజుల్లో కనీసం డిపాజిట్ కూడా రాదని పేర్కొన్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ మరింతగా దిగజారుతోందని విమర్శించారు. అంతేకాదు కాంగ్రెస్ పార్టీ దిగజారుతానానికి ప్రజలు ఆ పార్టీని మరింతగా చీకొడతారని గంట రవికుమార్ పేర్కొన్నారు. బీహార్ ప్రజల్ని తప్పుదారి పట్టిస్తూ విద్వేషపూరిత సంస్కృతికి రాహుల్ గాంధీ ఆద్యం పోస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ కుయుక్తులను దేశ ప్రజలు చూస్తున్నారని, వారికి తగిన గుణపాఠం కచ్చితంగా చెబుతారని గంట రవికుమార్ పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుక్షణం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతోందని రవికుమార్ పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ఓట్లు తెచ్చి పెడతాయని ..ఇలా దిగజారుడు వ్యాఖ్యలతో కాదని రవికుమార్ కాంగ్రెస్ కు చురకలంటించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కాసు శిల్పా, మహిళా మోర్చా నాయకురాలు పిట్టల సరస్వతి, మార్త ఉషారాణి, స్వర్ణ, రాజేశ్వరి, ఉమాదేవి, స్వరూప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బన్న ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, గడల కుమార్, ఫైర్తా ఆనంద్, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుదర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైరి నాగరాజు, సోషల్ మీడియా కన్వీనర్ నోముల రతన్, జిల్లా విశ్వకర్మ సెల్ కన్వీనర్ శ్రీరామోజు మోహన చారి, కార్యాలయ కార్యదర్శి పెద్ది నవీన్, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, అపురూప రజనీష్, బోరిగం నాగరాజు, బీజేపీ నాయకులు కర్నే రవీందర్, అంకాల జనార్ధన్, వైట్ల గణేష్, మామిడాల సతీష్, అల్లి అజయ్, జెట్లింగ్ శివ, గోల రాజకుమార్ మడిపల్లి నాగరాజు గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్య సేవలపై కలెక్టర్ సత్య శారద ఆరా

**ఆరోగ్య అధికారులతో సమీక్ష**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులైన సీకేఎం, ఎంజీఎం, నర్సంపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వర్ధన్నపేట ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్లు, ఆర్ఎంఓలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో వరంగల్ కలెక్టరేట్ చాంబర్ లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలు తెలుసుకొని వాటిలో ఉన్న సమస్యలను అధిగమించడానికి పరిష్కార మార్గాలను సూచించారు. సీకేఎం ఆసుపత్రిలో గర్భిణీలకు అందుతున్న సేవల్లో అంతరాయాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రేడియాలజిస్ట్, మత్తు డాక్టర్ల కొరత ఉండటంతో సీకేఎంలో సేవలకు అంతరాయం కలుగుతోందని అధికారులు సూచించడంతో వెంటనే స్పందించిన కలెక్టర్ ఎంజీఎం నుంచి రేడియాలజిస్ట్, మత్తు డాక్టర్లను డిప్యూటేషన్ పైన సీకేఎంలో పనిచేయడానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, ఎంజీఎం సూపరింటెండెంట్ కిషోర్, డిప్యూటీ డాక్టర్ మురళి, సీకేఎం హాస్పిటల్ ఇంచార్జ్ సూపరిండెంట్, ఆర్ఎంఓ డాక్టర్ మురళి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నర్సంపేట సూపరింటెండెంట్ డాక్టర్ కిషన్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, ఏరియా హాస్పిటల్ వర్ధన్నపేట సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధుల సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి..

వృద్ధులు, దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపాలపి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వయోవృద్ధులు, దివ్యాంగులకు నిర్వహించిన




ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వృద్ధులు, దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్జీదారులు అందించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని అన్నారు. గత నెల ప్రజావాణి సందర్భంగా వచ్చిన సమస్యల పరిష్కారంపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని, పెండింగ్ దరఖాస్తులు ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# దండు మోహన్‌కు పరామర్శ

**సంతాపం ప్రకటించిన ఐజేయూ నాయకులు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు మోహన్ కుమార్తె దండు మౌలిక మృతి చెందగా శనివారం పలువురు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు పరామర్శించారు. హనుమకొండలోని విజయలక్ష్మి కాలనీలో నివాసం ఉంటున్న దండు మోహన్ స్వగృహంలో దండు మౌలిక మృతదేహానికి వారు నివాళులు అర్పించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు దండు మోహన్ ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన కూతురు అకస్మిక మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంకనాల సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు సాయిరాం, నాయకులు భిక్షపతి, ఎస్ఎం ప్రభాకర్, సాంబయ్య, శోభన్, న్యాయవాదులు బండి మొగిలి, సాయిని నరేందర్, వీసీకే పార్టీ అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, బీసీ జేఏసీ నాయకులు తాడిశెట్టి క్రాంతి కుమార్ తదితరులు ఉన్నారు.



# దాసు రఘురామ్‌కు నివాళులు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు, వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ దాసు సురేష్ తండ్రి ఇటీవల అకాల మరణం పొందగా గ్రేటర్ హైదరాబాద్ కు చెందిన పలువురు మహిళలు శనివారం ఘనంగా నివాళులర్పించారు. గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు పద్మావతి, ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ గోషికా స్వప్న, గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ సిటిజెన్ జనరల్ సెక్రెటరీ శారదమ్మ, శ్రీలత తదితరులు నగరంలోని దాసు సురేష్ ఇంటికి చేరుకొని దాసు రఘురామ్ కు శ్రద్ధాంజలి ఘటించారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థించారు.



# మహా అన్నదానం..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ఆర్ఎన్టీ రోడ్ లో 'ది వరంగల్ బులియన్ జ్యూయలరీ డైమండ్ మర్చంట్ అసోసియేషన్' వారి ఆధ్వర్యంలో వినాయక నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నదాన కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు గుండు శ్రీనివాస్, స్టేట్ జాయింట్ సెక్రటరీ తోట హరీష్, గౌరవ అధ్యక్షులు పడిశాల నాగరాజు, ఉపాధ్యక్షులు వంగాళ రవి, మాజీ కోశాధికారి గార్లపాటి శ్రీనివాస్, సభ్యులు నాగుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com